క్లుప్తంగా

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేష వస్త్రాలను అందించారు.

అప్పన్న సన్నిధిలో మంత్రి జనార్దన్‌రెడ్డి



మంత్రి జనార్దన్‌రెడ్డికి అప్పన్న చిత్రపటాన్ని అందిస్తున్న ఈవో త్రినాథరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బి.సి.జనార్దన్‌రెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని, బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి అష్టోత్తరపూజ నిర్వహించారు. వేద ఆశీర్వచనం అనంతరం ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక, శేష వస్త్రాన్ని ఈవో వి.త్రినాథరావు అందించారు. మంత్రి వెంట పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి, భాష్యం ప్రవీణ్, పులవర్తి నాని, మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, నగర మేయర్ పీలా శ్రీను తదితరులు ఉన్నారు.

విద్యార్థుల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు



పాఠశాల సందర్శనలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ప్రత్యేక అధికారి సరోజిని

పరవాడ: విశాఖలో శనివారం నిర్వహించనున్న యోగాంధ్రకార్యక్రమంలో పాల్గొనే పాఠశాల విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఎన్‌ఆర్‌ఈజీఎస్ మండల ప్రత్యేక అధికారి ఎస్.సరోజిని ఉపాధ్యాయులకు సూచించారు. తానాం, పరవాడ జెడ్పీ స్కూళ్లను ఆమె శుక్రవారం సందర్శించి, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. యోగాంధ్రలో పాల్గొనే విద్యార్థులకు అవసరమైన తాగునీరు, భోజనం తదితర సదుపాయాలను కల్పించాలన్నారు. ఆమె వెంట జనసేన మండల ప్రధాన కార్యదర్శి వర్రి పరదేశినాయుడు, ఉపాధ్యక్షుడు వెన్నల నరసింహరావులు ఉన్నారు.

విద్యార్థుల యోగాసనాలు



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

సింహాచలం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు శుక్రవారం యోగాసనాలు వేశారు. పాఠశాల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో యోగా విశిష్టతను ఉపాధ్యాయులు వివరించారు. ఉపాధ్యాయిని టి.పి.విద్యావతి విద్యార్థులకు యోగాసనాలు నేర్పించారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని, ప్రతి ఒక్కరూ యోగాను దినచర్యలో భాగంగా చేసుకోవాలని సూచించారు.

రైతు కంట ఉప్పు నీళ్లు

ఈ ఏడాది కురిసిన అకాల వర్షాలతో ఉప్పు రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో కురిసిన వర్షాలకు నాలుగో వంతు ఉప్పు పంట నష్టపోవాల్సి వచ్చింది. మార్చి, ఏప్రిల్, మే మాసాల్లో పండించిన ఉప్పులో వర్షాలకు కొంత కరిగిపోగా, మిగిలిన ఉప్పుకు ఆశించినంత ధరలేక నష్టం చవిచూడాల్సి వచ్చిందని మండలంలోని దలాయిపాలేనికి చెందిన ఉప్పు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- అకాల వర్షాలతో ఉప్పు రైతు విలవిల
- వెయ్యి బస్తాల బదులు 750 బస్తాలే దిగుబడి
- తగ్గిన ధరలతో మరింత కుదేలు



దలాయిపాలెంలో అకాల వర్షాలతో నీటి ముంపులో ఉప్పు మడులు

పరవాడ: మండలంలోని వాడచీపురుపల్లి శివారు దలాయిపాలెంలో 260 ఎకరాల్లో నాయుడుపాలెం, వాడచీపురుపల్లి, గొరుసువానిపాలెం, పందివానిపాలెం, పోలిరెడ్డిపాలెం గ్రామాలకు చెందిన రైతులు ఉప్పు పంటను సాగు చేస్తున్నారు. ఇందుకు డిసెంబర్ నుంచి ఉప్పు మడులను సిద్ధం చేసుకుని, ఫిబ్రవరి నుంచి ఉప్పును తీసే కార్యక్రమానికి పూనుకుంటారు. వేసవి ఆరంభంతో ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో ఎండలు మెండుగా కాస్తే ఉప్పు దిగుబడులు బాగావచ్చి, కాస్త సొమ్ము కళ్ల చూడవచ్చని ఆశించిన రైతులకు ఈ ఏడాది తీవ్ర నిరాశే మిగిలింది. ఉప్పు సాగు మొదలెట్టిన నుంచి అడపాదడపా కురిసిన వర్షాలతో రైతులకు కన్నీళ్లే మిగులుతున్నాయి.

అనుకూలించని వాతావరణం

మే, జూన్ మాసాల్లో వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తాయని ఆశించిన రైతాంగానికి ఉన్నట్టుండి కురిసిన అకాల వర్షాలు ఆవేదన పెంచాయి. రెండు మాసాల్లో కురిసిన వర్షాలకు భూమి చల్లబడి, ఉప్పు దిగుబడులు పూర్తిగా తగ్గిపోయాయి. సేకరించిన ఉప్పు కొంత గట్లపైనే కరిగిపోయింది. మిగిలిన దాన్నైనా మంచి ధరలకు అమ్ముకుందామని ఆశించినప్పటికీ గిట్టుబాటు ధరలేక అతి తక్కువ ధరలకే అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. గతేడాది కూడా ఇదే పరిస్థితి నెలకొనడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమైనట్లు చెప్తున్నారు.

తగ్గిన దిగుబడి

వాతావరణం అనుకూలిస్తే ఎకరాకు వెయ్యి (80 కిలోల)బస్తాల దిగుబడి రావాల్సిన చోట, అకాల వర్షాలతో ఈ ఏడాది 750 బస్తాల ఉప్పు మాత్రమే దిగుబడి వచ్చిందంటున్నారు. గతంతో పోల్చితే ఎకరాకు 250 బస్తాల మేర దిగుబడులు తగ్గినట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది 80 కిలోల బస్తా రూ.250 నుంచి రూ.280కు విక్రయించగా, ఈ ఏడాది రూ.260కి మించి ధర పలకని పరిస్థితి. వర్ష ప్రభావంతో ఉప్పు దిగుబడులు పూర్తిగా తగ్గిపోవడంతో ఉప్పు సాగుకు వడ్డీ వ్యాపారుల నుంచి తెచ్చిన రుణాలకు వడ్డీ కట్టలేక అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అకాల వర్షాలతో తీవ్ర నష్టం



ఈ ఏడాది ఎండలు మెండుగా కాస్తే ఉప్పు పంటలో మంచి దిగుబడులు సాధించవచ్చని ఆశించాం. ప్రతి కూల వాతావరణ పరిస్థితులతో ఉప్పు దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయి. ఉప్పు పంట చేతికందే సమయంలో కురిసిన వర్షాలకు ఉప్పు దిగుబడులు పూర్తిగా పడిపోయాయి. మిగిలిన ఉప్పును కూడా ఆశించిన ధరల్లేక ఏదో ఒక ధరకు అమ్ముకోవాల్సి వస్తోంది. పంట కోసం తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లిస్తున్నాం. ఏటా ఇలాంటి పరిస్థితులే ఎదురవడంతో నష్టాల నుంచి తేరుకోలేకపోతున్నాం.

– బూస రామునాయుడు, ఉప్పు రైతు

ప్రభుత్వమే ఆదుకోవాలి



నేను 80 సెంట్లలో ఉప్పు సాగు చేస్తున్నా. అకాల వర్షాలతో ఉప్పు మడుల్లో చేరిన బురద నీటిని తొలగించి మళ్లీ పంటకు సిద్ధం చేయడానికే ఎక్కువ పెట్టుబడులు పెట్టాను. ఎండలు కాయాల్సిన సమయంలో వర్షాలు కురిస్తే ఉప్పు దిగుబడులు ఏ విధంగా తీయగలం. గతేడాది కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఈ ఏడాదైనా వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తాయని ఆశించాం. కానీ అకాల వర్షాలు వచ్చి మా బతుకుల్ని అప్పుల పాల్జేశాయి. తీవ్రంగా నష్టపోయిన ఉప్పు రైతును ప్రభుత్వం ఆదుకోవాలి.

– బి.రాంబాబు, ఉప్పు రైతు

కూలి పనుల్లేవు



నేను ఉప్పు గల్లీలో రోజువారి కార్మికుడిని. ఏడాదిలో ఏడు నెలల పాటు కూలి పనులు దొరుకుతాయి. రోజుకు వచ్చే రూ.550తో కుటుంబాన్ని నెట్టుకురావాలి. ఈ ఏడాది అడపాదడపా కురిసిన వర్షాలతో ఉప్పు పంట పనులు ఆగిపోయాయి. కూలీలకు పనులు లేకుండా పోయాయి. కుటుంబ పోషణ కోసం ప్రత్యామ్నాయ కూలి పనులకు వెళ్లాల్సి వస్తుంది. ఎండలు మెండుగా కాస్తే కూలీలకు నిత్యం పనులు దొరుకుతాయి. కానీ ఆకాల వర్షాలు వల్ల ఈ ఏడాది కూలి పనులు లేకుండా పోయాయి.

– కె.అప్పారావు, దినసరి కార్మికుడు

ఘనంగా గణపతి ఆలయ వార్షికోత్సవం



గణపతిని దర్శించుకుంటున్న అదీప్‌రాజ్, నాయకులు

పెందుర్తి: మండలంలోని రాజయ్యపేటలో కొలువుదీరిన వినాయకుడి ఆలయం 14వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గణపతికి ఉదయం నుంచి అభిషేకాలు, పూజలు జరిపారు. మధ్యాహ్నం జరిగిన భారీ అన్నసమారాధనలో దాదాపు 2 వేల మంది అన్నప్రసాదాలు స్వీకరించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, నాయకులు మధుపాడ అంజి, మొల్లంపాక దిలీప్‌కుమార్, నక్క మహేష్, ఈసరపు గోవింద్, పిల్లా సాయిసీతారాం పాత్రుడు, రాయవరపు జగన్, ఆలయ కమిటీ ప్రతినిధులు, అధిక సంఖ్యలో భక్తులు గణపతిని దర్శించుకున్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళాలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి అనకాపల్లికి చెందిన చాగంటి కుక్కుటేశ్వరరావు రూ.లక్ష, కాకినాడకు చెందిన కస్తూరి జగన్నాథరావు రూ.లక్ష 120 విరాళాన్ని అందించారు. సింహగిరిపై ఉన్న పీఆర్వో కార్యాలయంలో ప్రోటోకాల్ విభాగం సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణకు విరాళాన్ని చెక్కు రూపంలో ఇచ్చారు. దేవస్థానం తరపున దాతలకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేష వస్త్రాలను అధికారులు అందించారు.

రెడ్ బుక్ రాజ్యాంగంతోనే కూటమి పాలన

- ఏడాది కాలంలో రాష్ట్ర ప్రజలను దారుణంగా వంచించిన కూటమి ప్రభుత్వం
- చంద్రబాబుకు ఓటు వేయడమే రాష్ట్ర ప్రజలకు శాపంగా మారింది
- సంక్షేమ పథకాలు అమలు చేయాలని అడుగుతున్న వారిని కేసులతో వేధిస్తున్నారు
- వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అమర్‌నాథ్ ధ్వజం



'చంద్రబాబు అంటే మోసం-జగన్ అంటే నమ్మకం' పుస్తకం ఆవిష్కరిస్తున్న అమర్‌నాథ్, అదీప్‌రాజ్, పార్టీ నేతలు

పెందుర్తి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగానికి బదులు హత్యలు, దాడులతో కూడిన రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోందని రాష్ట్ర మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ ఆరోపించారు. చంద్రబాబు ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అడిగితే వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు సామాన్య ప్రజలను కూడా కేసులతో భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తోందని మండిపడ్డారు. పెందుర్తి మండలం రాంపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో 'చంద్రబాబు అంటే మోసం-జగన్ అంటే నమ్మకం' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏడాది కాలంలో దాదాపు 390 మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను కూటమి ప్రభుత్వం హత్య చేయించిందని, 750 మందికి పైగా కార్యకర్తలపై దాడులు చేశారని ఆరోపించారు. ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని అడిగిన పాపానికి దాదాపు 2500 మంది సోషల్ మీడియా కార్యకర్తలపై కేసులు పెట్టి, నెలల తరబడి జైళ్లలో ఉంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత సీఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలనే పేర్లు మార్చి అమలు చేస్తామని చెప్పి, అది కూడా చేయలేదని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ కూటమి ప్రజాప్రతినిధులు రాష్ట్రాన్ని అన్ని విధాలా దోచుకుంటున్నారని ఆరోపించారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఏడాదిగా చేసిన హత్యలు, దాడులు, అవినీతి, మోసాలను ఎండగడుతూ చంద్రబాబు అంటే మోసం-జగన్ అంటే నమ్మకం పుస్తకాన్ని రూపొందించామన్నారు. దీన్ని రానున్న రోజుల్లో క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకువెళతామని చెప్పారు.

అదీప్‌రాజ్ మాట్లాడుతూ ఏడాదికాలంలోనే కూటమి ప్రభుత్వం తీవ్ర ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటోందన్నారు. నియోజకవర్గంలో కూటమి నాయకులు అవినీతి, భూ కబ్జాలకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నారని విమర్శించారు. కూటమి నాయకుల చేతిలో ఇబ్బందులకు గురవుతున్న ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేతలు బయిలపూడి భగవాన్ జయరామ్, శరగడం చినఅప్పలనాయుడు, గండి రవికుమార్, ఉప్పిలి కనకరాజు, మధుపాడ అంజి, కొటాన రాము, యతిరాజుల నాగేశ్వరరావు, గండ్రెడ్డి మహాలక్ష్మినాయుడు, దాడి నూకరాజు, బల్ల రాంబాబు, తామర్ల నర్సింగ్, దొడ్డి కిరణ్, గొరపల్లి శ్రీను, మెంటి మహేష్, పీతల అప్పలరాజు, దాడి ఉమామహేష్, రాపర్తి మాధవరావు, దాసరి సత్తిబాబు, కాళ్ల గంగాధర్, అవగడ్డ శ్రీనివాస్, రఘు, ఉగ్గిన నాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యోగాంధ్రకు బస్సులు.. ప్రయాణికులకు ఇక్కట్లు



బస్సుల కోసం ప్రయాణికుల పడిగాపులు



విద్యార్థులను సబ్బవరం మీదుగా యోగాంధ్రకు తరలిస్తున్న ఆర్టీసీ బస్సులు

సబ్బవరం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖలోని ఆర్కే బీచ్ నుంచి భీమిలి బీచ్ మధ్య నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమానికి ఆర్టీసీ బస్సులన్నీ కేటాయించడంతో ప్రయాణికులకు శుక్రవారం తీవ్ర కష్టాలు ఎదురయ్యాయి. జిల్లా పరిధిలో చాలా బస్సులను ఈ కార్యక్రమానికి జనాల్ని తరలించేందుకే వినియోగించడంతో సాధారణ సేవలకు బస్సులు కనీస స్థాయిలో కూడా లేకుండా పోయాయి. విషయం తెలియని చాలా మంది ప్రయాణికులు ఎప్పటిలానే తమ గమ్య స్థానాలకు చేరుకునేందుకు బస్సుల కోసం గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. ఎప్పటికీ బస్సులు రాకపోవడంతో చాలా మంది ఆటోలు, ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు. రెండు మూడు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన వారు కాలినడకకు పనిచెప్పారు.

నాలుగున్నర గంటలుగా..



నా పేరు మంజేటి రమేష్, మా స్వగ్రామం వి.మాడుగుల. నేను సబ్బవరంలోని ఓ టిఫిన్ సెంటర్‌లో పని చేస్తున్నాను. శుక్రవారం పని ముగించుకుని మా స్వగ్రామం వెళ్లేందుకు మధ్యాహ్నం 12 గంటలకు సబ్బవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వచ్చా. సాయంత్రం 4:30 అవుతున్నా ఒక్క బస్సూ రాలేదు. నాతో పాటు అనేక మంది ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు బస్సుల కోసం కాంప్లెక్స్‌లో గంటల తరబడి కాచుక్కూర్చున్నారు. ఒక్క బస్సూ రాలేదు. చివరకు విశాఖ వైపు నుంచి బైక్‌పై వస్తున్న నా స్నేహితుడికి ఫోన్ చేయడంతో, ఆయన వస్తున్నట్లు చెప్పడంతో ఎదురు చూస్తున్నాను.

గాయత్రి ఆలయ వార్షికోత్సవాలకు అంకురార్పణ



అభిషేకాలు చేస్తున్న అర్చకులు



అభిషేకానికి సిద్ధం చేసిన కలశాలు

పెందుర్తి: చినముషిడివాడ సమీపంలోని శ్రమశక్తినగర్లో కొలువుదీరిన పంచముఖ గాయత్రిమాత ఆలయ 15వ వార్షికోత్సవ కార్యక్రమాలు శుక్రవారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు సుప్రభాత సేవ, కలశాభిషేకం, అలంకరణ, సర్వదర్శనం, వేదపారాయణం, లలితా సహస్రనామం, హనుమాన్ చాలీసా పారాయణం జరిగాయి. ప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రెండోరోజు శనివారం సుప్రభాత సేవ, లలిత సహస్ర నామార్చన, అష్టోత్తర నామ పారాయణ, హనుమాన్ చాలీసా, సాయంత్రం ఊయల సేవ, దీపాలంకరణ, గాయత్రీ హోమం, పూర్ణాహుతి నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త సరస్వతుల నరసింహమూర్తి తెలిపారు.


అధ్వాన రహదారులతో అవస్థలు



గుంతలతో నిండిన పెదముషిడివాడ-ఈ.మర్రిపాలెం రోడ్డు

పరవాడ: మండలంలో రోడ్ల పరిస్థితి నానాటికీ దారుణంగా మారుతోంది. సంక్రాంతికి గుంతల్లేని రోడ్లని గొప్పలు పోయిన కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ మాదిరిగానే రోడ్లనూ వదిలేసింది. ఇందుకు నిదర్శనమే పెదముషిడివాడ-ఈ.మర్రిపాలెం రహదారి. ఈ రోడ్డు అధ్వానంగా మారడంతో అక్కడి ప్రజలు రాకపోకల్లో నరకయాతన పడుతున్నారు. పెదముషిడివాడ-ఈ.మర్రిపాలెం గ్రామాల మధ్య రహదారి కొన్నేళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదు. క్వారీ లారీలు ఎక్కువగా రాకపోకలు సాగించడంతో రోడ్డంతా గోతుల మయంగా మారింది. సుమారు రెండు కిలోమీటర్ల నిడివి కలిగిన ఈ రహదారిలో కనీసం వీధి దీపాలు కూడా లేవు. చీకటి పడితే ఏ గోతిలో పడతామోనని ప్రయాణికులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని స్వగ్రామాలకు చేరుతున్నారు. చిన్నపాటి వర్షం పడినా గుంతల్లో నీరు చేరి, రోడ్డేదో.. గొయ్యేదో గుర్తించలేక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఎన్నిసార్లు వేడుకుంటున్నా పట్టించుకోవట్లేదని ఇరు గ్రామాల ప్రజలు ఆక్షేపిస్తున్నారు.

కామ్రేడ్ తారక్‌నాథ్ సేవలు చిరస్మరణీయం



ఆలయ కమిటీ సభ్యులకు హుండీని అందిస్తున్న ఎస్‌బీఐ సిబ్బంది

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరంలో స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) అనకాపల్లి రీజియన్ ఆధ్వర్యంలో దివంగత కార్మిక నేత కామ్రేడ్ తారక్‌నాథ్ 21వ వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ జనరల్ సెక్రటరీ కామ్రేడ్ ఎల్.చంద్రశేఖరరావు పిలుపు మేరకు నిర్వహించిన కార్యక్రమంలో అనకాపల్లి రీజియన్ మేనేజర్ బీకే మహా పాత్రో, రీజనల్ సెక్రటరీ పైలా ప్రసాదరావు మాట్లాడుతూ తారక్‌నాథ్ సేవల్ని కొనియాడారు. ఆయన వర్ధంతి రోజు రాష్ట్రం నలుమూలలా సేవా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ మేరకు సబ్బవరం శివారు పెదనాయుడుపాలెంలో కొలువైన మర్లమాంబ అమ్మవారి ఆలయంలో 200 మందికి అన్నదానం నిర్వహించి, హుండీని అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ రాజశేఖర్, ఆర్‌బీవో స్టాఫ్ పృధ్వీ, లోకల్ సెక్రటరీలు మురళి, కల్యాణ్, నరేష్, తిరుపతిరావు, మహేష్, గౌరి, అమర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.